బయో ఆసియా...
ఆవిష్కరణలు అదుర్స్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ప్రారంభమైన లైఫ్‌సైన్సెస్, హెల్త్‌కేర్ ఫోరమ్ బయో ఆసియా సదస్సు 22వ ఎడిషన్‌లో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ ట్రేడ్ షో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ ప్రదర్శనలో ఏర్పాటుచేసిన పలు స్టాల్స్‌ను పరిశీలిస్తే..

ప్రయోగాలకు ఎలుకలు అందిస్తాం



వ్యాక్సిన్‌లు లేదంటే ప్రాణ రక్షక ఔషధాల పనితీరును ముందుగా పరీక్షించేది మానవ జన్యు నిర్మాణానికి దగ్గరలో ఉన్న ఎలుకలు, కోతులు వంటి వాటి పైనే. ప్రీ క్లినికల్ ట్రయల్స్‌కు ఇప్పటికీ ఎలుకలపై ఆధారపడుతుంటారు. నిర్దిష్టమైన సమస్యను లక్ష్యంగా చేసుకుని ప్రయోగాలు చేసే కంపెనీల కోసం ఎలుకలలో జన్యు పరివర్తన చేసి ఇచ్చే సంస్థ జనీవర్ ల్యాబ్స్ ఫ్రాన్స్ కేంద్రంగా కార్యకలాపాలను ఈ సంస్థ నిర్వహిస్తోంది. ప్రస్తుతం మనిషి కాలేయానికి దగ్గరగా ఉండే రీతిలో కాలేయం కలిగిన ఓ ఎలుకను అభివృద్ధి చేశామని, కాలేయ వ్యాధులపై పరిశోధనలకు ఇది తోడ్పడుతుందని ఆ సంస్థ ఇంటర్నేషనల్ ఆపరేషన్స్ హెడ్ లిలీ పేర్కొంటున్నారు. బెంగళూరులో పదేళ్లుగా ఉంటున్న ఆమెకు హైదరాబాద్‌లోని పలు కంపెనీలకు సైతం తాము వీటిని సరఫరా చేశామంటున్నారు.

ప్రొటీన్ సీక్వెన్సింగ్‌ను సులభంగా చేస్తోంది



ప్రొటీన్ సీక్వెన్సింగ్ అనేది చాలా వరకూ ఫార్మా ల్యాబ్‌లతో పాటుగా డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లలోనూ కనిపిస్తుంది. గతంలో ప్రొటీన్ సీక్వెన్సింగ్ చేయాలంటే సమయం, ఖర్చుతో కూడుకోవడంతో పాటుగా ఫలితాలపై కూడా సందేహం ఉండేది. ఇప్పుడు అలాంటి సమస్యలకు చెక్ పెడుతూ ప్లాటినం ప్రొటీన్ సీక్వెన్సర్ తీసుకువచ్చామంటున్నారు క్వాంటమ్ డాట్ ఎస్ఐ ప్రతినిధులు. దీనికోసం ప్రత్యేకంగా ల్యాబ్ అవసరం లేదని, నైపుణ్యం కూడా పెద్దగా అవసరం లేదంటున్నారు.

స్మార్ట్ రీయూజబుల్ నోట్ బుక్



ఏఐతో పనిచేసే స్మార్ట్ రీ యూజబల్ నోట్ బుక్‌ను విడుదల చేసింది క్వాడ్రిక్ ఐటీ సంస్థ. టీ హబ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే ఈ సంస్థ రీనోట్ ఏఐ పేరిట దీనిని విడుదల చేసింది. మీరు మీ నోట్స్‌తో మాట్లాడే అవకాశం కల్పించే ఈ రీనోట్, మీకు కావాలనుకుంటే అదనపు సమాచారం కూడా అందిస్తుంది. ఈ నోట్‌బుక్ వాటర్‌ప్రూఫ్, చిరగదు. డాటా ఎప్పటికీ మీ బుక్‌లోనే ఉంటుంది. దీని ధర రూ.999. కానీ, ఆఫర్‌లో భాగంగా రూ.499 అందిస్తున్నారు.

ప్యాకేజింగ్‌లోనూ పర్యావరణ పరిరక్షణ

వ్యాక్సిన్‌ల ప్యాకేజింగ్‌లకు ఉష్ణోగ్రత నియంత్రణ తప్పనిసరని ప్లానెట్ ప్రొటెక్టర్ సంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఊలుతో తయారుచేసిన ప్యాకేజింగ్ బాక్స్‌లను వీరు బయో ఆసియా సదస్సులో భాగంగా ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతానికి ఆస్ట్రేలియాలో మాత్రమే కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఈ సంస్థ తమ మలి మజిలీగా హైదరాబాద్‌ను ఎంచుకుంది. త్వరలోనే ఇక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభించనుందని సంస్థ ప్రతినిధి నమిత బంకా తెలిపారు.

డీఎన్ఏ ప్రొఫైలింగ్ అందుబాటులోకి : ఏజిలెంట్ టెక్నాలజీ

మన శరీరం పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే డీఎన్ఏ ప్రొఫైలింగ్ చేయించుకోవాలి. ఇలా చేయడం ద్వారా రాబోయే ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించడం, చికిత్స అందించడం సులభతరం అవుతుంది. ఏజిలెంట్ టెక్నాలజీ డీఎన్ఏ విశ్లేషణకు అవసరమైన యంత్రాలను సమకూర్చుతుంది. వీటిని ప్రముఖ ఆస్పత్రులు, పరిశోధన సంస్థలకు అందిస్తున్నాం.

ఫార్మా క్లినికల్ ట్రయల్స్‌లో ఏఐ సహకారం : కోగెనిక్ ఏఐ

కృత్రిమమేథ సహకారంతో ఫార్మా రంగంలో ఔషధాల తయారీ, క్లినికల్ ట్రయల్స్ పరిశోధనలను సులభంగా నిర్వహించే అవకాశాన్ని కోగెనిక్ ఏఐ అందుబాటులోకి తెచ్చింది. ఔషధాల తయారీతోపాటు వాటి వినియోగం వల్ల వచ్చే దుష్ఫలితాలను కృత్రిమ మేథ ద్వారా గణించి, ప్రభుత్వ నిబంధనలకు తగిన విధంగా నివేదికను రూపొందించే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు సంస్థ కో ఫౌండర్ రోమేష్ సేత్ తెలిపారు.


ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే ఈజీ సర్వర్ రూమ్



ఐటీ, ఫార్మా సంస్థలు తమ కంప్యూటర్లను, అందులో ఉన్న సమాచారాన్ని భద్రపరుచుకునేందుకు సర్వర్లు కీలకం. వెర్టివ్ సర్వర్ రూమ్‌ను అన్ని భద్రత ఏర్పాట్లతోపాటు సులభంగా ఒకచోట నుంచి మరో చోటికి తీసుకెళ్ల వచ్చని తయారీ దారులు తెలిపారు. ప్లగ్ అండ్ ప్లే తరహాలో సర్వర్ రూములు రూపొందిస్తున్నామని, ఆయా సంస్థలకు అవసరమైన విధంగా కస్టమైజేషన్ చేసి అందిస్తామన్నారు.

రూ.4,030 కోట్లతో
రతన్‌టాటా రోడ్డు

- 41.50 కిమీల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రహదారి
- 28వ తేదీ నుంచి టెండర్లు



రతన్ టాటా రోడ్డు (చిలకపచ్చ రంగులో ఉన్న గీత)

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓఆర్ఆర్‌లోని రావిర్యాల(టాటా ఇంటర్ చేంజ్) నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా ఆమన్‌గల్ వద్ద ప్రతిపాదిత ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రహదారికి రాష్ట్ర ప్రభుత్వం రతన్‌టాటా రోడ్డుగా పేరు పెట్టింది. ఈ రోడ్డును రూ.4,030 కోట్లతో నిర్మించనున్నారు. 41.50 కి.మీ.ల పొడవు ఉండే ఈ రతన్ టాటా రహదారి నిర్మాణాన్ని రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో రూ.1,665 కోట్లతో ఓఆర్ఆర్ రావిర్యాల(టాటా ఇంటర్‌చేంజ్) నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 19.2 కి.మీ దూరం రోడ్డు నిర్మాణం చేపడతారు. రెండోదశలో రూ.2,365 కోట్లతో మీర్‌ఖాన్‌పేట(ఫ్యూచర్‌సిటీ) నుంచి ఆర్ఆర్ఆర్ (ఆమన్‌గల్) వరకు 22.30 కి.మీ దూరం రహదారి నిర్మాణం చేయనున్నారు. ఈ రహదారి నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం హెచ్ఎండీఏకు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్) సంస్థలకు అప్పగించింది. ఈ నేపథ్యంలో రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్లను ఫిబ్రవరి 28 నుంచి స్వీకరిస్తామని హెచ్ఎండీఏ మంగళవారం ప్రకటించింది. టెండర్ వివరాలను తమ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. సాంకేతిక బిడ్లను మార్చి 21న తెరుస్తామని హెచ్ఎండీఏ వెల్లడించింది.



సరూర్‌నగర్‌లోని అతిపురాతనమైన శివాలయంలో విశ్వరూప శివ లింగం



సరూర్‌నగర్‌లోని అతిపురాతనమైన శివాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లు



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినం కోసం వేయించిన చలువ పందిళ్లు



గడ్డిఅన్నారంలో ఉమా మహేశ్వరస్వామి దేవాలయం

మహాశివరాత్రికి
శైవక్షేత్రాలు ముస్తాబు

నేడు (బుధవారం) మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎల్బీనగర్, మహేశ్వరం, మలక్‌పేట నియోజకవర్గాల్లోని శైవ క్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయాలకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఆయా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేశారు. ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ప్రధాన రోడ్లు, కాలనీల రోడ్లు వివిధ రకాల పండ్లు, పూలతో దర్శనమిచ్చాయి. వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రావడంతో ఆయా ప్రాంతాలతో పాటు పూలు, పండ్ల మార్కెట్లు, పూజా దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. ఈ ప్రత్యేక రోజున తమతమ ప్రాంతాల్లోని భక్తుల జాగరణ నిమిత్తం సాయంత్రం నుంచి తర్వాతి రోజు ఉదయం వరకు వివిధ ఆలయ కమిటీలు, అసోసియేషన్లు, హిందూ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సాంస్కృతిక, నాటక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశాయి.

-మన్సూరాబాద్/నాగోల్/దిల్‌సుఖ్‌నగర్/చంపాపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి)



హనుమాన్ దేవస్థానంలోని నాగేశ్వర ఆలయంలో నిత్యపూజలందుకుంటున్న శివలింగం



నాగోల్ డివిజన్ శివపురికాలనీలోని కాశీవిశ్వేశ్వరాలయం



మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని ఉమారామలింగేశ్వరాలయం



మహాశివరాత్రికి వివిధ రకాల పండ్ల విక్రయాలు

హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



సమస్యలను మధుయాష్కీ గౌడ్‌కు విజ్ఞప్తి చేస్తున్న విద్యార్థులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. వనస్థలిపురం సుష్మా చౌరస్తాలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలని మధుయాష్కీ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ సుమారు 300 మంది విద్యార్థులున్న బీసీ సంక్షేమ హాస్టల్లో కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఒకే గదిలో 40మందికి పైగా నిద్రిస్తున్న తమకు ఫ్యాన్లు, కిటికీలు, మూత్రశాలలు కూడా సరిగా లేవన్నారు. పాతబడిన భవనంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తాము కళాశాలకు వెళ్లే సమయానికి భోజనం తయారుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమసల్యను పరిష్కరించి తమ చదువులకు ఆటంకం కలగకుండా హాస్టల్లో సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. స్పందించిన మధుయాష్కీగౌడ్ వార్డెన్‌తో పాటు జిల్లా బీసీసంక్షేమ హాస్టల్స్ డిప్యూటీ డైరెక్టర్ బానోతు కేశరాంతో ఫోన్లో మాట్లాడారు. వెంటనే ఆయా హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అధికారులు హాస్టల్స్‌ను సదర్శించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. తాను కూడా హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంతేకాకుండా ప్రైవేట్ వ్యక్తుల సహకారంతో పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు దాము మహేందర్ యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయండి

- జలమండలి ఎండీతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో సమావేశమైన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో సమస్యల పరిష్కారానికి రూ.10కోట్ల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కోరారు. మంగళవారం జలమండలి కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డితో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలకుంట ఎల్‌పీటీ మార్కెట్ వెనుక నుంచి సరస్వతినగర్ వరకు నూతన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని కోరారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గౌతమినగర్‌కాలనీ, సాహెబ్‌నగర్ వీకర్ సెక్షన్‌లో నూతన పైప్‌లైన్లు వేయాలన్నారు. సాహెబ్‌నగర్ అంజయ్యగూడలో నూతన పైప్‌లైన్లు వేయాల్సిన అవసరం ఉందన్నారు. జలమండలి ఎండీ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గం యూత్ వింగ్ అధ్యక్షుడు రవిముదిరాజ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

చంపాపేట: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట సాగర్‌రోడ్‌లోని మంద యాదవరెడ్డి గార్డెన్‌లో మంగళవారం సరూర్‌నగర్ మండలం బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోషియేషన్ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌మీట్-2024-25ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై సరస్వతీదేవి చిత్రపటం ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడం కేవలం ఉపాధ్యాయులకే సాధ్య పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్పోర్ట్స్‌మీట్‌లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. అసోషియేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 23వ డివిజన్‌లోని యాదాద్రినగర్ కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై స్థానికులు మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కాలనీకి చెందిన చప్పిడి రాజిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు అధికారులను కలిసి స్థానికంగా కొందరు బిల్డర్లు ఎలాంటి సెట్‌బ్యాక్స్ లేకుండా, ఇరుగుపొరుగు వారికి ఇబ్బంది కలిగిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని వివరించారు. ఈనెల 11వ తేదీన సదరు అక్రమ నిర్మాణాలపై బడంగ్‌పేట్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

సైదాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాగడ హారతితో పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం సాయినాథుడికి 108 కళశాలతో అభిషేకాలు, అఖండ దీపారాధన, ప్రత్యేక అలంకరణ, అర్చన చేశారు. ఆదిపరాశక్తి పీఠ వ్యవస్థాపకులు స్వామి ఓం స్వరూపజీ ఆధ్వర్యంలో మహిళలు సాయినామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో టీటీడీ మాజీ బోర్డు సభ్యులు సామ గణేష్‌రెడ్డి, దిల్‌సుఖ్‌నగర్ సాయి సంస్థాన్ చైర్మన్ గుండా మల్లయ్య, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని చేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదికకు 17 ఫిర్యాదులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికకు 17 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రీవెన్స్ చైర్‌పర్సన్ లలిత హాజరయ్యారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఈ మాధవరెడ్డి, డీఈఈ నరేష్‌కుమార్, ఏడీఈ శ్రీనివాస్, జేఈ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో గౌరవంగా బతకండి

- ట్రాన్స్‌జెండర్లకు ఎల్బీనగర్ డీసీపీ సూచన



ట్రాన్స్‌జెండర్‌కు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాలు జరిగే ప్రాంతాలకు వెళ్లి న్యూసెన్స్, రాత్రిపూట రోడ్ల పక్కన నిలబడి వ్యభిచారం చేయొద్దని ఎల్బీనగర్ డీసీపీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ ట్రాన్స్‌జెండర్లకు సూచించారు. ఇలాంటి చర్యల వల్ల ట్రాన్స్‌జెండర్లపై సమాజంలో తీవ్ర వ్యతిరేకత వస్తుందని, ఆ వ్యతిరేకత నుంచి బయటపడి సమాజం నుంచి సానుభూతి వచ్చేలా ప్రయత్నించాలని ఆయన అన్నారు. ట్రాన్స్‌జెండర్లకు ఆధార్ నమోదు, సర్టిఫికెట్ల ప్రదానం కోసం మంగళవారం మీర్‌పేట్ పోలీసు స్టేషన్‌లోని వికల్ప్ సెంటర్‌లో ప్రజ్వల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డి, మీర్‌పేట్ ఎస్‌హెచ్‌వో కీసర నాగరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ షాపుల్లో, సిగ్నల్స్ వద్ద, రోడ్లపై భిక్షాటనను ఆపేయాలని, తమ ప్రతిభ, నైపుణ్యం ఆధారంగా స్వయం ఉపాధిగానీ, ప్రభుత్వ ఉద్యోగం గానీ పొందడానికి ప్రయత్నించాలని సూచించారు. ఆసక్తి గలవారు వికల్ప్ కేంద్రంలో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకుని వారి సహకారం తీసుకోవాలన్నారు. ఏసీపీ కాశీరెడ్డి మాట్లాడుతూ స్వయం ఉపాధి పొందాలనుకునే ట్రాన్స్‌జెండర్లకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా పోలీసు శాఖ సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల ఫౌండేషన్, వికల్ప్ సెంటర్ ప్రతినిధులు ముకుందమాల, భవానీ ప్రసాద్, శ్రీకాంత్, మీర్‌పేట్ ఎస్సైలు సుధాకర్, సారంగపాణి, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హేళన చేసిన వారే సెల్యూట్ కొడుతున్నారు

ఒకప్పుడు తాను ట్రాన్స్‌జెండర్‌గా తిరుగుతూ సమాజం నుంచి వ్యతిరేకత తెచ్చుకున్నాను. ఇటీవల ప్రభుత్వం తనకు ట్రాఫిక్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చి సమాజంలో గౌరవం కల్పించింది. మంగళవారం మీర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తనను ఒకప్పుడు అందరూ హేళన చేశారు. అలాంటి వారు ఇప్పుడు తనను చూసి సెల్యూట్ కొట్టి అభినందిస్తున్నారు. ఇంతకన్నా గౌరవం ఇంకేం కావాలి. తన సహచరులందరూ తనలాగే మారి మంచి జీవితం ప్రారంభించాలని కోరుకుంటున్నా. - నక్షత్ర, ట్రాఫిక్ అసిస్టెంట్, సంతోష్‌నగర్ పీఎస్

పత్తి సాగును ప్రోత్సహించడానికి ఆర్థిక సహాయం

హయత్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ మండలాలలకు సాంకేతికతను లక్ష్యంగా చేసుకోవడంతో భాగంగా హయత్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రీడా) లోని రంగారెడ్డి జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కిసాన్ మేళాను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసీఏఆర్ డైరెక్టర్ షేక్ఎన్.మీరా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు రంగారెడ్డి జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవల వల్ల సాగుకు ఖర్చులు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. హై డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టమ్ (హెచ్‌డీపీఎస్) ద్వారా పత్తి సాగును ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులను అధికారులు సన్మానించారు.

'కేంద్ర బడ్జెట్‌ను సవరించకుంటే ... తిరుగుబాటే'

హయత్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం పేదల వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని దానిని సవరించకుంటే తిరుగుబాటు చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు హెచ్చరించారు. సీఐటీయూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తుర్కయంజాల్‌లో కేంద్ర బడ్జెట్- ప్రజలపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్.వెంకటరాములు హాజరై, మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్నా ప్రధాని మోదీ, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానన్నా సీఎం రేవంత్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. వెంటనే కేంద్రప్రభుత్వం బడ్జెట్‌ను సవరించకుంటే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవులు

ఓల్డ్‌మలక్‌పేట: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా రెండురోజులు సెలవులు వచ్చాయి. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా సెలవు, తరువాత రోజు గురువారం అమావాస్య కావడంతో మార్కెట్ మూసివేస్తారు. ప్రతి అమావాస్య రోజు మార్కెట్ బంద్ ఉంటుంది. రైతులు, వ్యాపారులు గమనించాలని మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు.

విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి

హయత్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హయత్‌నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025- 2026 విద్యా సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వక ముందే ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్లు తీసుకుంటున్నాయని తెలిపారు. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. కొంత మంది ఉన్నతాధికారుల అండదండలతోనే ఈ దందా నడుస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అరుణ్‌కుమార్‌గౌడ్, కాటి శ్రావణి, వెంకటేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

స్టాంవాటర్ పైప్‌లైన్ పనులు చేపట్టాలి: కార్పొరేటర్

వనస్థలిపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా స్టాంవాటర్ పైప్‌లైన్ పనులు చేపట్టాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ శ్రీనివాసపురం కాలనీలో మంగళవారం కార్పొరేటర్ పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్టాంవాటర్ పైప్‌లైన్ పనులు కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ విగ్నేశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేతాజీ కాలనీ రోడ్డు పునరుద్ధరణ



రోడ్డును పునరుద్ధరించిన ట్రాఫిక్ పోలీసులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారి నుంచి హయత్‌నగర్ గ్రామానికి, దాదాపు 300 కాలనీలకు వెళ్లేందుకు నేతాజీనగర్ కమాన్ వద్ద ఉన్న ఒకే ఒక రోడ్డును వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు మూసివేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 12న... 'మా దారేటో చెప్పండి' అనే శీర్షిక కథనం ప్రచురించింది. స్పందించిన వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులను పరిశీలించారు. ఉన్నతాధికారులతో చర్చించి వారి ఆదేశాల మేరకు మంగళవారం నేతాజీకాలనీ వద్ద రోడ్డుకు అడ్డంగా పెట్టిన బారికేడ్‌లను తొలగించి, రోడ్డును పునరుద్ధరించారు. ఈ సందర్భంగా స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు, 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లల్లో పెరుగుతున్న మయోపియా కంటి సమస్యలు



వనస్థలిపురంలో క్లినిక్ ప్రారంభిస్తున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారుల్లో మయోపియా కంటి సమస్యలు అధికమవుతున్నాయని కంటి వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. సెంటర్ ఫర్ సైట్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలో మయోపియా క్లినిక్‌ను మంగళవారం పిల్లల వైద్యుడు శ్రీనివాస్ మూర్తి ప్రారంభించగా, పిల్లల నేత్ర వైద్యుడు మోహన్ కన్నంతో పాటు వైద్యులు పాల్గొన్నారు. సాధారణ కంటి ఆసుపత్రులతో పోల్చితే, మయోపియా క్లినిక్‌లో ప్రత్యేక నిర్ధారణ, తొందరపాటు జోక్యం, నిపుణుల సమగ్ర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మయోపియా, పిల్లల నేత్ర సమస్యలు, కణజాల చికిత్సలు, రెటినా, గ్లాకోమా, కటారాక్ట్, కణితి సంబంధిత నేత్ర వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నామని సెంటర్ ఫర్ సైట్ ప్రతినిధులు తెలిపారు.